TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-205 పేజీలు:-4 బుధవారం 08-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## అమెరికాకు చురకలు, పాకిస్థాన్‌కు హెచ్చరిక, భారత్‌కు స్నేహహస్తం!

తాలిబాన్ మంత్రి ఇంటర్వ్యూ



- బగ్రామ్ ఎయిర్‌బేస్ తిరిగి ఇవ్వడం కల మాత్రమేనన్న తాలిబన్లు
- ట్రంప్ డిమాండ్‌ను తిరస్కరించిన ఆఫ్ఘన్ మంత్రి
- సరిహద్దు ఉద్రిక్తతలపై పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక
- భారత్‌తో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడానికి సిద్ధమన్న తాలిబన్లు

ఆఫ్ఘనిస్థాన్‌లోని బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను తిరిగి తమ అధీనంలోకి తీసుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరికను తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా తిరస్కరించింది. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో భారత్‌తో వాణిజ్య- మిగతా 2 లో

## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!



- సింధు జలాల వాటా కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్న పాక్ సైన్యం
- నీటి కోసం భారత్‌తో యుద్ధానికైనా సిద్ధమంటూ బిలావల్ భుట్టో వ్యాఖ్యలు
- పహల్గాం దాడి తర్వాత సింధు ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- ఉగ్రవాదాన్ని ఆపనంత వరకు ఒప్పందంపై ముందడుగు లేదని కేంద్రం స్పష్టీకరణ

భారత్, పాకిస్థాన్ మధ్య చారిత్రక సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇప్పటివరకు కేవలం రాజకీయ నాయకులకే పరిమితమైన హెచ్చరికలు, ఇప్పుడు పాక్ సైనిక నాయకత్వం నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. సింధు జలాల్లో తమకు న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా హెచ్చరించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న - మిగతా 2 లో

## కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ



- తన శాఖ అధికారులతో తనకు సమాచారం ఇవ్వకుండా కడియం సమీక్ష నిర్వహించారన్న సురేఖ
- మంత్రిగా తన పరిధిని బేఖాతరు చేశారని మండిపాటు
- కడియంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్

మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీలో దుమారం - మిగతా 2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్

# పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని
- ఆ కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు
- ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును



2లో

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు,

## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల

# కేసీఆర్ విచారం



- రాజకీయాల్లో నీతి, నిజాయతీకి నర్సింహారెడ్డి నిదర్శనంగా నిలిచారన్న కేసీఆర్
- తన వందలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టారని కితాబు
- తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వ్యాఖ్య

తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ - మిగతా 2 లో

## తనను విజేతగా ప్రకటించాలని

# కోర్టును కోరిన వైనం

- విజయ్ గెలుపును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ ను విచారణకు స్వీకరించిన హైకోర్టు
- విజయ్ విజయాన్ని రద్దు చేయాలంటూ డీఎంకే అభ్యర్థి పిటిషన్
- పెండింగ్ కేసుల వివరాలను దాచారని ఆరోపణ



2లో

తమిళనాడు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించి సీఎం పీఠం ఎక్కిన దళపతి విజయ్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. ఆయన ఎన్నికల విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను

## అయోధ్య విరాళాల గల్లంతు

ఆ తర్వాతే మాట్లాడతానన్న చంపత్ రాయ్



- సిట్ తుది నివేదిక తర్వాతే పూర్తి సమాధానమిస్తానని ప్రకటన
- విచారణ కొనసాగుతున్నందున ప్రస్తుతం మాట్లాడటం లేదని వెల్లడి
- ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పదవికి ఆయన రాజీనామా ఇప్పటికే ఆమోదం

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ ఆరోపణలపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి - మిగతా 2 లో

## ఇండోనేషియాలో మోదీ నోట 'కుచ్ కుచ్ హోతా హై'




- జకార్తా పర్యటనలో 'కుచ్ కుచ్ హోతా హై' పాటను ప్రస్తావించిన ప్రధాని మోదీ
- భారత్, ఇండోనేషియా కలిసి పనిచేస్తే 'బహుత్ కుచ్' జరుగుతుందని వ్యాఖ్య
- ఇండోనేషియాలో భారత సినిమాల ఆదరణపై ప్రధాని హర్షం
- ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్ పెట్టిన దర్శకుడు కరణ్ జోహార్
- తన సినిమాకు గుర్తింపునిచ్చారంటూ ఆనందం వ్యక్తం చేసిన కరణ్

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు - మిగతా 2 లో

## ఏపీకి పెట్టుబడుల వేట

కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు



- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ
- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఏపీని ఏఐ-కంప్యూట్ హబ్?గా మార్చాలని శాంసంగ్‌కు ప్రతిపాదన
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఏపీని అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న లోకేశ్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన



- టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం అభివృద్ధి
- కళాకారుల జీవితాలపై ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని ఆదేశం
- ఉప్పాడ చీరలు, అరటి నార వస్తువులు కొనుగోలు చేసిన పవన్
- గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకం తరహాలోనే 'హస్తకళల పర్యాటకాన్ని' - మిగతా 2 లో

# కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు శుభవార్త

- కొత్తగా భూసమీకరణ పరిధిలోకి వచ్చిన రైతులకు రుణమాఫీ
- పదేళ్లపాటు ఏటా రూ.40 వేల కౌలు చెల్లింపునకు ఆమోదం
- అమరావతిలో 25 అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటుకు సీఎం ఆదేశం
- భూములు ఇవ్వని వారి నుంచి భూసేకరణకు చర్యలు
- దేవాదాయ భూములకు రూ.159 కోట్లు చెల్లించాలని నిర్ణయం



2లో

రాజధాని అమరావతి నిర్మాణంలో భూసమీకరణ రెండో దశలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల్లోని రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు అందించింది. భూసమీకరణ కింద భూములు ఇచ్చే ఆయా

# ఏపీకి పెట్టుబడుల వేట

-మొదటిపేజీ తరువాయి దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు. సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

-మొదటిపేజీ తరువాయి

కూడా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఉత్సవం 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కళాకారుల జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్య కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ఏర్పాటు చేస్తామని, చేతివృత్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, కళాకారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం, ఉత్సవం ప్రాంగణంలోని స్టాళ్లను సందర్శించిన పవన్ కల్యాణ్ కళాకారులతో ముచ్చటించారు. కాకినాడ తోలుబొమ్మలాట, ఉప్పాడ జామ్దానీ చీరలు, కలంకారీ కళాఖండాలు, తిరుపతి కొయ్యబొమ్మలు, నరసాపురం లేస్ ఉత్పత్తులతో పాటు అరటి నారతో రూపొందించిన వస్తువులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా కొన్ని ఉప్పాడ చీరలను, అరటి నారతో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌ను కొనుగోలు చేసి కళాకారులను వ్యక్తిగతంగా అభినందించారు. రామాయణ, మహాభారత ఘట్టాలను ప్రతిబింబిస్తూ సాగిన తోలుబొమ్మలాట ప్రదర్శన పవన్ కల్యాణ్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రాచీన కళకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు, రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.

## కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

రైతులు ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీఆర్డీఏ 63వ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలకు కూడా ఈ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. 2024 జూన్ నుంచి భూములు ఇచ్చిన రైతులకు పదేళ్లపాటు ఏటా రూ.40 వేలు కౌలుగా చెల్లించనున్నారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏటా రూ.10 వేల చొప్పున పదేళ్లపాటు చెల్లింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలతో భూములు ఇచ్చిన రైతులకు ఆర్థికంగా భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతి పరిధిలోని ఈనాం భూములకు సంబంధించి దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు కూడా సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. రాజధాని అభివృద్ధిలో భాగంగా అమరావతిలోని 25 టౌన్‌షిప్‌లలో ఒక్కో అంతర్జాతీయ పాఠశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మరోవైపు, భూసమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు రాని వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం రాత్రిలోగా భూములు ఇవ్వని వారి నుంచి మరుసటి రోజు నుంచే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఇప్పటికే కొన్నిచోట్ల 2.5 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్లు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఒకవైపు రైతులకు భరోసా కల్పిస్తూనే, మరోవైపు అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు.

## కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ

-మొదటిపేజీ తరువాయి

రేపుతోంది. కడియం శ్రీహరిపై ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అయిన తనకే కనీస సమాచారం ఇవ్వకుండా... ఆ శాఖ ఉన్నతాధికారులతో కడియం ఏకంగా అధికారిక సమీక్ష నిర్వహించారంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లేఖ రాస్తూ అధికారికంగా ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలను, మంత్రిగా తన అధికార పరిధిని పూర్తిగా బేఖాతరు చేశారని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, కీలక నిర్ణయాలు, అధికారిక సమీక్షలన్నీ పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకే వస్తాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. కానీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని... దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భూముల పరిరక్షణ వంటి అంశాలపై సమీక్ష చేశారని లేఖలో మండిపడ్డారు. అంతేకాకుండా అధికారులకు డెడ్‌లైన్లు కూడా పెట్టడం పరిపాలనా పరంగా తీవ్ర అభ్యంతరకరమని, ఇది ప్రభుత్వ 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్ఫూర్తిని నిలువునా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న కడియం శ్రీహరికి... శాఖా పరమైన నిర్ణయాలు మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలనే కనీస విషయం తెలియదా అని కొండా సురేఖ నిలదీశారు. తనను పూర్తిగా పక్కనపెట్టి ఇలాంటి సమీక్షలు చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయానికి కారణమవుతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని... అలాగే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కొండా సురేఖ కోరారు.

## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ విచారం

-మొదటిపేజీ తరువాయి

అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో అత్యంత నిరాడంబరతకు, నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచిన ఒక గొప్ప ప్రజల మనిషిని మనం కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవలో నర్సింహారెడ్డి చేసిన అపారమైన కృషిని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. భూదానోద్యమ సమయంలో తన సొంత వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి నర్సింహారెడ్డి ఆదర్శంగా నిలిచారని కేసీఆర్ కొనియాడారు. 1969లో సాగిన తొలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా... మూసీ నది పరిరక్షణ కోసం, తెలంగాణ ప్రాంతానికి గోదావరి నదీ జలాల సాధన కోసం ఆయన చివరి శ్వాస వరకు నిరంతరం కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. నర్సింహారెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోవడం తీరని లోటు అని అన్నారు. ఆయన మరణంతో శోకసముద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

– మొదటిపేజీ తరువాయి ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని.. ఆ కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేసీఆర్ తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని ఆయన విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ఆయన తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. ఆ విషయంలో వారికి వారే సాటి అని ఎద్దేవా చేశారు. మరోవైపు ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు సీఎం. అబద్ధాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని ఆయన చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి మరీ యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖా తాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇండోనేషియాలో మోదీ నోట 'కుచ్ కుచ్ హోతా హై'

– మొదటిపేజీ తరువాయితెలిపారు. ఇండోనేషియాలోని జకార్తాలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని తన ప్రసంగంలో 'కుచ్ కుచ్ హోతా హై' సినిమాను ప్రత్యేకంగా ప్రస్తావించడమే ఇందుకు కారణం. ఆ పాటను చిరస్థాయిగా నిలిపారంటూ మంగళవారం కరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇండోనేషియాలో భారత సినిమాలకు ఉన్న ఆదరణ గురించి మాట్లాడుతూ ప్రధాని మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' టైటిల్ సాంగ్‌ను ఉదహరించారు. "ఇక్కడ భారతీయ గీతం 'కుచ్ కుచ్ హోతా హై' చాలా ప్రాచుర్యం పొందింది. భారత్, ఇండోనేషియా కలిసికట్టుగా ముందుకు సాగితే, 'కుచ్ కుచ్' (కొంత) నుంచి 'బహుత్ కుచ్' (చాలా) సాధించవచ్చు" అని ప్రధాని చమత్కరించారు. రెండు దేశాల మధ్య బలమైన సహకారానికి ఉన్న అవకాశాలను ఆయన తన మాటల ద్వారా చాకచక్యంగా వివరించారు. ప్రధాని ప్రసంగం వీడియోను కరణ్ జోహార్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జకార్తాలో 'కుచ్ కుచ్ హోతా హై' గురించి మాట్లాడటం గౌరవంగా, ఆనందంగా ఉంది. ప్రేమకు భాషతో సంబంధం లేదు. ఈ పాటను ఆదరించి, చిరస్థాయిగా నిలిపినందుకు ధన్యవాదాలు" అని కరణ్ పేర్కొన్నారు. కరణ్ జోహార్ దర్శకుడిగా పరిచయమైన తొలి చిత్రం 'కుచ్ కుచ్ హోతా హై'. ఆయన తండ్రి యశ్ జోహార్ నిర్మించిన ఈ సినిమాలో షారుఖ్ ఖాన్, కాజోల్, రాణీ ముఖర్జీ ప్రధాన పాత్రల్లో నటించగా, సల్మాన్ ఖాన్ కీలక పాత్రలో కనిపించారు. ఈ చిత్రం బాలీవుడ్‌లో క్లాసిక్ రొమాంటిక్ డ్రామాగా నిలిచిపోయింది.

## అమెరికాకు చురకలు, పాకిస్థాన్‌కు హెచ్చరిక, భారత్‌కు స్నేహహస్తం!

– మొదటిపేజీ తరువాయి సంబంధాలను విస్తరించుకోవడానికి ఆసక్తిగా ఉన్నామని సంకేతాలిచ్చింది. ఇండియా టుడేకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాలిబన్ సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రి ముహాజిర్ ఫరాహీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. బగ్రామ్ వైమానిక స్థావరాన్ని అమెరికా తిరిగి పొందడం కేవలం "కలల్లోనే సాధ్యం" అని ఆయన స్పష్టం చేశారు. 2021లో అమెరికా సేనలు వెనక్కి వెళ్లాక బగ్రామ్ స్థావరం తాలిబన్ల ఆధీనంలోకి వచ్చింది. చైనాకు సమీపంలో వ్యూహాత్మకంగా కీలకమైన ఈ స్థావరాన్ని తిరిగి పొందాలని ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో పెరుగుతున్న ఘర్షణలపై ఫరాహీ తీవ్రంగా స్పందించారు. ఇటీవల పాక్ చర్యలకు తాము బలమైన సమాధానం ఇచ్చామని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు ఏ స్థాయి వరకైనా వెళతామని హెచ్చరించారు. జూన్ చివరిలో ఆఫ్ఘన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 38 మంది పౌరులు మరణించారని ఆఫ్ఘన్ అధికారులు ఆరోపించగా, 29 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాక్ ప్రకటించింది. మరోవైపు, భారత్‌తో తమకు చారిత్రక సంబంధాలు ఉన్నాయని ఫరాహీ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. తరచూ సరిహద్దులు మూసివేస్తున్న పాకిస్థాన్‌పై ఆధారపడకుండా ఇరాన్, భారత్, చైనా ద్వారా వాణిజ్య మార్గాలను విస్తరించుకుంటున్నామని తెలిపారు. కాబుల్‌లో అమెరికాపై సాధించిన విజయానికి గుర్తుగా ఓ యుద్ధ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు కూడా ఆయన వెల్లడించారు..

## అయోధ్య విరాళాల గల్లంతు

– మొదటిపేజీ తరువాయిచంపత్ రాయ్ స్పందించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన తుది నివేదికను సమర్పించిన అనంతరమే ఈ ఆరోపణలపై పూర్తిస్థాయిలో సమాధానమిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రామభక్తులను ఉద్దేశించి ఆయన ఒక లేఖ విడుదల చేశారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మౌనంగా ఉండటమే శ్రేయస్కరమని భావిస్తున్నట్లు తెలిపారు. తన ప్రజా జీవితం ఒక తెరిచిన పుస్తకమని చంపత్ రాయ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి స్పందిస్తూ, చంపత్ రాయ్‌ను ఆయన నమ్మిన వ్యక్తులే మోసం చేశారని, ఇందులో ట్రస్టీల ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సిట్ దర్యాప్తు పురోగతిలో ఉందని తెలిపారు. వాస్తవాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే హామీ ఇచ్చారు. జూన్ ప్రారంభంలో ఆలయ హుండీ నగదు లెక్కింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు వార్తలు వెలువడటంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సీసీటీవీ నిఘా లోపం, సిబ్బందిపై సరైన తనిఖీలు లేకపోవడం, కొందరు ఉద్యోగులు నగదును దారిమళ్లించడం వంటి అంశాలను సిట్ తన ప్రాథమిక నివేదికలో గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో దాదాపు రూ. 7 నుంచి 8 కోట్ల వరకు నిధులు గల్లంతైనట్లు అంచనా వేస్తున్నారు. ట్రస్ట్ సభ్యుడి ఫిర్యాదు మేరకు జూన్ 25న ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నగదు లెక్కింపు సిబ్బందితో పాటు చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివాదం తీవ్రం కావడంతో జూలై 6న సమావేశమైన ట్రస్ట్, చంపత్ రాయ్, మరో ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలను ఆమోదించింది.

# విజయ్ గెలుపును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ ను విచారణకు స్వీకరించిన హైకోర్టు

– మొదటిపేజీ తరువాయిమద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఆయనతో పాటు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆదవ్ అర్జున గెలుపుపై వచ్చిన పిటిషన్లను కూడా జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ ఏకసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని టెక్నికల్ లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని కోర్టు ఆదేశించింది. ఆ ప్రాసెస్ పూర్తి కాగానే విజయ్‌తో పాటు మంత్రికి 3 వారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనుంది. అయితే, ఈ వ్యవహారంలో హైకోర్టు జడ్జి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా ఏళ్ల తరబడి సాగే ఈ ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, కేవలం ఆరు నెలల లోపే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విజయ్ విజయాన్ని సవాలు చేస్తూ డీఎంకే అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ ఈ పిటిషన్ వేశారు. నామినేషన్ అఫిడవిట్‌లో విజయ్ తనపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను దాచారని, అలాగే ఎన్నికల ఖర్చులను కూడా పూర్తిగా చూపించలేదని ఇనిగో తన ఫిర్యాదులో ఆరోపించారు. దీనికి తోడు, ఎన్నికల ప్రచారంలో నిబంధనలకు విరుద్ధంగా చిన్నపిల్లలను వాడుకున్నారనే అంశాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ కారణాలన్నింటినీ చూపిస్తూ విజయ్ విజయాన్ని రద్దు చేసి, తనను విజేతగా ప్రకటించాలని ఇనిగో కోరారు.



అంతేకాకుండా, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఉపఎన్నికపై కూడా స్టే విధించాలని డీఎంకే అభ్యర్థి హైకోర్టును కోరడంతో ఇప్పుడు ఈ సరికొత్త పొలిటికల్ వార్ తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ 'జన నాయగన్' సెన్సార్ రిపోర్ట్ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ 'జన నాయగన్'కు సెన్సార్ ప్రక్రియ పూర్తయిందంటూ ప్రచారం ఈ ప్రచారాన్ని నమ్మొద్దన్న నిర్మాతలు సెన్సార్ బోర్డు కొన్ని సవరణలు సూచించిందని వెల్లడి

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' సెన్సార్ ప్రక్రియ పూర్తయి 'ఏ' సర్టిఫికెట్ వచ్చిందంటూ సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. జులై 23న విడుదల అని కూడా వార్తలు వ్యాపించాయి. అయితే ఇది పూర్తిగా తప్పుడు సమాచారం అని చిత్ర నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. సెన్సార్ బోర్డు సభ్యులు సినిమాను వీక్షించి కొన్ని సవరణలు సూచించారని, ప్రస్తుతం ఆ మార్పులు చేసే పనిలో బృందం బిజీగా ఉందని నిర్మాతలు తెలిపారు. మార్పులు పూర్తి కాగానే రీ-సెన్సార్ కోసం బోర్డుకు పంపుతామని, అన్ని సాంకేతిక పనులు త్వరగా పూర్తి చేసి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. అభిమానులు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, అధికారిక అప్‌డేట్ వచ్చే వరకు వేచి చూడాలని కోరారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్ పాత్రను పోషించింది. విజయ్ చివరి చిత్రం కావడంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

– మొదటిపేజీ తరువాయిసంబంధాలను మరింత జఠిలం చేస్తోంది. పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన 276వ కోర్ కమాండర్ల ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రభుత్వ ఆదేశాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సింధు జలాల్లో తమ హక్కును కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని సైన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మళ్లించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గత ఏడాది ఏప్రిల్ 24న పాక్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) చేసిన తీర్మానాన్ని ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. దేశ సన్నద్ధత, వృత్తి నైపుణ్యం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింధు నది జలాలను భారత్ ఒక 'ఆయుధం'గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే భారత్‌తో యుద్ధం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. సైనిక సమావేశంలో ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పాక్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీలకు తమ నైతిక, రాజకీయ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. గత ఏడాది పహల్గాంలో 26 మంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి తర్వాత, దానికి ప్రతీకార చర్యగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ శాశ్వతంగా, విశ్వసనీయంగా స్వస్తి పలికేంత వరకు ఈ ఒప్పందంపై ముందుకు వెళ్లేది లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఒప్పందాలు ఒంటరిగా మనుగడ సాగించలేవని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్‌పై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు నియంత్రణ ఉంటుంది. ఒప్పందం నిలిచిపోవడంతో, రుతుపవనాల సమయంలో పాక్‌తో వరద సమాచారాన్ని పంచుకోవాల్సిన బాధ్యత భారత్‌కు లేకుండా పోయింది. ఇదే సమయంలో భారత్.. సింధు నదీ బేసిన్‌లో సావల్‌కోట్, రాటిల్, బుర్సార్ వంటి పలు జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. పాకిస్థాన్ వ్యవసాయంలో 80-90 శాతం సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఆ దేశంలోని ప్రధాన జలాశయాలైన టార్బేలా, మంగ్లా డ్యామ్‌లలో నీటి నిల్వలు అడుగంటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకప్పుడు సాంకేతిక ఒప్పందంగా ఉన్న సింధు జలాల అంశం ఇప్పుడు ఇరు దేశాల మధ్య కీలకమైన వ్యూహాత్మక ఒత్తిడి కేంద్రంగా మారింది.

## నగ్నంగా ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన కాంగ్రెస్ కౌన్సిలర్



**నిజం న్యూస్ జనగాం జిల్లా, జూలై 7:** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్‌లో వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన 9వ వార్డు కౌన్సిలర్ చౌదరపల్లి సంపత్ రాజ్ వృద్ధురాలు అరవడంతో అప్రమత్తమై అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు వారిని చూసి బాత్రూంలోకి దూరిన సంపత్ రాజ్ బయటి నుండి గడియ పెట్టి పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు సంపత్ రాజ్ అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు

## మియాపూర్ మంగళవారం సంతకు సహకరించిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రవికుమార్ యాదవులకు ఘన సన్మానం




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 7:** మంగళవారం సంత ఏర్పాటుకు సహకరించిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని, రాష్ట్ర అధికార ప్రతి రవికుమార్ యాదవ్ ని సన్మానించిన మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి మియాపూర్ న్యూ కాలనీ మార్కెట్ ఏర్పాటుకు సహకరించినందుకు గాను కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు స్థానిక ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ని ,రవికుమార్ యాదవ్ ని ఆహ్వానించి పేద ప్రజలకు అండగా నిలిచినందుకు వారి ఇరువురిని సన్మానించారు. మీరు ఏ ఒక్కరికి భయపడకుండా నిశ్చింతగా, నిర్భయంగా మీరు మార్కెట్ ను నిర్వహించుకోవచ్చునని దళారులకు, కబ్జా దారులకు భయపడే ప్రసక్తి లేదని, అవసరమైతే పార్లమెంటులో మాట్లాడి మోడల్ మార్కెట్ యార్డ్ కింద ఈ ల్యాండ్ ను సాంక్షన్ చేపిస్తానని ఎంపీ తెలిపారు. పేద ప్రజల తరపున అధికారులతో చర్చించి మార్కెట్ నిర్వహించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధికారికంగా పర్మిషన్స్ వచ్చే విధంగా చొరవ చూపిన స్థానిక ఎంపీ కి స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులకు రవి కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు ఖాజా బాషా, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, అడ్వకేట్ కిషోర్ యాదవ్,లక్ష్మణ్ ముదిరాజ్ ,గణేష్ ముదిరాజ్, పవన్ యాదవ్, నాగులు, పట్టాభిరామ్,శివ భాష, రాము మొదలవారు పాల్గొన్నారు

## SIR ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించిన కాంగ్రెస్ నాయకులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 7:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ᖇ×=) కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్ పరిధిలోని గోపాలనగర్, విశ్వాంబరి, శ్రీలా, శిల్పా ఎవెన్యూ, ఎస్ఎంఆర్ సిటీ కాలనీల్లో సోమవారం ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులను నిర్దేశిత దరఖాస్తుల ద్వారా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని ఫారాలను త్వరితగతిన సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై సర్కార్ ఉక్కు పాదం!



**నిజం న్యూస్ హైదరాబాద్:జులై 07:** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో ప్రణాళికాబద్ధమైన నగర అభివృద్ధికి బాటలు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తుంది ఇందులో భాగంగా అక్రమ నిర్మాణాల కట్టడికి అత్యంత కఠినమైన నిబంధనలతో కూడిన 'క్యూర్ బిల్లు -- 2026' ముసాయిదాను సిద్ధం చేసింది. మహా నగరంలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది,ఈ కొత్త బిల్లులో పలు కీలక సవరణలను ప్రతిపాదించింది. ఈ ముసాయిదా బిల్లులోని అత్యంత కీలకమైన ప్రతిపాద నలు రూపొందించిం ది అనుమతిలేని అక్రమ నిర్మాణాలపై ఏకంగా 300 శాతం ఆస్తి పన్ను విధించ డం. ప్రస్తుతం అమ లులో ఉన్న జీహెచ్ ఎంసీ చట్టం-1955 ప్రకారం అక్రమ నిర్మాణాలపై ఆస్తి పన్నులో 100 శాతం మాత్రమే జరిమానా విధిస్తున్నారు. అయితే, ఈ పెనాల్టీలు అక్రమ కట్టడాలను అడ్డుకో లేకపోతుండటంతో, కొత్త బిల్లు ద్వారా దానిని మూడు రెట్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. భారీ జరి మానాల భయం తోనైనా నిబంధనల ఉల్లంఘనలు తగ్గు తాయని భావిస్తోం ది.మరోవైపు, నగ రంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ఈ బిల్లు ద్వారా పూర్తి చట్టబద్ధతతో పాటు అదనపు అధికారా లను కల్పించనున్నా రు. భూకబ్జాదారులపై నేరుగా క్రిమినల్ కేసులు నమోదు చేసే అధికారాన్ని కూడా హైడ్రాకు అప్పగించనున్నారు. అంతేకాకుండా, ప్రజారోగ్యానికి ము ప్పుగా పరిణమిస్తూ, దోమలు మరియు వివిధ వ్యాధుల వ్యాప్తికి కారణమ య్యే నిర్లక్ష్యపు ప్రాంగణాలను, నిర్మాణ స్థలాలను తక్షణమే మూసివేసే సీజ్ చేసే కఠినమైన అధికారం కూడా అధికారులకు ఇవ్వనున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

### ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాలి

### ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

### ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం బహిరంగ బహిరంగ లేఖ

**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 7:** రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో ద హిందూ హడల్ కాంక్లేవులో ప్రకటించడాన్ని తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు, ప్రముఖ కవులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద మందికి పైగా వివిధ రంగాలకు చెందిన మేధావులు ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖను రాశారు. ఈరోజు మంగళవారం జులై 7 2026 రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో పత్రికా విలేఖరుల సమావేశాన్ని నిర్వహించి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో విస్తరించి ఉన్న 23 వేల బడుల మూసివేతను ఉపసంహరించుకోవాలని, విశృంఖలంగా పెరిగిపోతున్న విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణను నియంత్రించాలని, అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టాలని మరియు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, సరిపడా టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ప్రముఖ పాత్రికేయుడు సంపాదకులు కే రామచంద్ర మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్రంలో విద్యార్థులు లేరని 23 వేల పాఠశాలల మూసివేసే ఆలోచన తగదని, బడులను కుదిస్తే ప్రజలు విద్యకు దూరం చేసినట్లు అవుతుందని తెలిపారు. నాక్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని అలాగే రాజకీయాలలో విద్య లేదని కానీ విద్యలో రాజకీయాలు ఎక్కువైపోయాయని ఆ కారణంగానే సామాజిక అవసరాలు గుర్తించకుండా పాఠశాలల మూసివేత ప్రకటన చేశారని దుయ్యబట్టారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదనే నెపంతో పాఠశాలల మూసివేత నిర్ణయాలు గైకొనడం సరికాదని వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలేంటో శాస్త్రీయంగా అధ్యయనం చేశారా అని ప్రశ్నించారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి ప్రసంగిస్తూ విద్యకు 15% నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వ మూసివేసిన 6000 పాఠశాలలను తెరిపిస్తామని తమ మేనిఫెస్టో ద్వారా హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కేవలం 8.2% మాత్రమే కేటాయించి మరియు ఏకంగా 23 వేల పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం ప్రజలను ప్రజలను వహించడమే కాగలదన్నారు. కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ 23 వేల పాఠశాలల మూసివేత ద్వారా ఉత్పన్నమయ్యే పరిణామాల పట్ల భయంగొల్పుతున్నదని సాక్షాత్తు ముఖ్యమంత్రి విద్యామంత్రిగా ఉంటూ ఇలాంటి తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం పట్ల తన ఆక్షేపణ ప్రకటించారు. హైకోర్టు సీనియర్ అడ్వకేట్ చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వము లాగానే నేటి ప్రభుత్వం కూడా ప్రజాస్వామికంగా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదని రాజ్యాంగ పరిధిలో ప్రజా పాలన అందిస్తామని ప్రకటించి ఏకపక్షంగా 23 వేల పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడాన్ని తప్పు పట్టారు ఆర్టిఈ చట్టం ప్రకారం గ్రామానికి పాఠశాల ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ పాఠశాల మూసివేత ప్రకటన సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. పాఠశాలల పరిరక్షణ మరియు బలోపేతం కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జి హరగోపాల్ ప్రసంగిస్తూ పాఠశాల మూసివేత ప్రకటన పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని బడికి గ్రామ ప్రజలకు ఉండే మానవీయ అనుబంధాన్ని తుంచి వేయడం తగదని తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కే చక్రధర్ రావు మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందినదని అలాగే ఎక్కువ బడ్జెట్ కలిగి ఉందని అయినప్పటికీ విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తున్నారని కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యను విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలను అదుపు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని జీవో ఎంఎస్ నెంబర్ వన్ మరియు విద్యా హక్కు 1982 నిబంధనల ప్రకారం నియంత్రించలేకపోతున్నదని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ వనమాల, ఫిలిం ప్రొడ్యూసర్ సయ్యద్ రఫీక్, శంకర్ డిబిఎఫ్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవాచారి, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, పిడిఎస్యు విజృంభన అధ్యక్షులు ఏ విజయ్ టి పి టి ఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, ఎం. ప్రకాష్ రావు, బి. ముత్యాలు, విజయ్ కుమార్, నర్సయ్య తదితరులు హాజరయ్యారు.

## డిజిటల్ గవర్నెన్స్ తో ముందుకు క్షేత్రస్థాయి అధ్యయనానికి కమిటీ

### వంద రోజుల్లో కొలిక్కి తీసుకురావాలి

### -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 7:** పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## రూ 10 కోట్ల 90 లక్షలతో దూలపల్లి జీడిమెట్ల పారిశ్రామిక వాడ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 7:** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం దూలపల్లి గ్రామం నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులకు స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల క్రితం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పూర్తిగా దెబ్బతిన్న ఈ రహదారిని కూన శ్రీశైలం గౌడ్ స్వయంగా పరిశీలించారు. అనంతరం రహదారి నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంబంధిత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు సంబంధిత మంత్రులకు లేఖలు అందజేశారు. ఆయన చేసిన నిరంతర కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ రహదారి నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసి, రూ.10.90లక్షలు నిధులను విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో ఈరోజు అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ,10 సంవత్సరాల పాటు పాలించిన బిఆర్ఎస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే ఏలాంటివి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు అన్నారు, ఈ రోడ్డు ధ్వంసమైననేపథంలో అనేకమంది ఈ రహదారి గుండా ప్రయాణించే ఉద్యోగుల ఇతర స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురయ్యారని విమర్శించారు,అదేవిధంగా రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే దూలపల్లి గ్రామ ప్రజలతో పాటు జీడిమెట్ల పారిశ్రామిక వాడకు నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, వాహనదారులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అదేవిధంగా జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబు కి శ్రీశైలం గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, జిల్లా లేబర్ సెల్ చైర్మన్ కందాడి సుదర్శన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైరి భాస్కర్ గౌడ్, మోహన్ రావు, అశోక్, మల్లేష్ , కావలి గోపాల్ ముదిరాజ్, బొబ్బ రంగారావు కౌన్సిలర్, నాగేశ్వరరావు, చాంద్ పాషా, మల్లేష్, వెంకటేష్, అశోక్, నాగరాజు యాదవ్, ఐలేష్ యాదవ్, గుంజ షణ్ముఖ, గుబ్బల రమణ, సంజయ్, టైగర్ రాములు, బొబ్బ ప్రసాద్, కే శంకర్, వాణి, స్థానిక అయ్యప్ప కాలనీ వాసులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# పాఠశాలలు మూసేస్తే ప్రభుత్వ విద్య బాగుపడుతుందా?-నాదెండ్ల శ్రీనివాస్

**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 7:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడిందనడానికి ప్రభుత్వం ఇటీవల విద్యారంగంలో మార్పులు తీసుకురావడానికి చేపడుతున్న నిర్ణయాలే నిదర్శనం.1,441 పాఠశాలలను మూసివేసి 2026 -- 27 యూడైస్ లెక్కల నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 640 పాఠశాలల్లో కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉండి,ఒక్క విద్యార్థి కూడా లేకపోవడంతో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయలను వేరే పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపించి వాటిని కూడా త్వరలో మూసివేయాలని నిర్ణయించింది.దీన్నిబట్టి ప్రభుత్వ విద్య పట్ల పాలక వర్గాలకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.2024-25 విద్యా సంవత్సరంలో 2,081 జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు ఉన్నట్టు తేలగా,ప్రస్తుతానికి 1,441 స్కూళ్లను మూసివేయడంతో పాటు,మిగిలిన 640 పాఠశాలలను మూసివేస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 24 వేల లోపే పరిమితం కానుంది. గ్రామాలలో పాఠశాలలు మూతపడటం వల్ల పేద, దళిత,గిరిజన,వెనుకబడిన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది.ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కంటే వాటిని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. తెలంగాణ సర్కార్ ఏడాదిన్నర క్రితం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అకునూరి మురళి ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన అధ్యయనంలో రాష్ట్రంలో విద్యా వెనుకబాటును స్పష్టంగా గుర్తిస్తూ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. అదే సమయంలో ప్రస్తుతం విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను,సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి విద్యారంగం వెనుకబాటు నుంచి బాగు చేయడానికి పలు సిఫార్సులు కూడా చేసింది. కేంద్రంలో ఎన్డీయే సర్కార్ రూపొందించిన నూతన విద్యా విధానం-(ఎన్ఈపి 2020)లోని అశాస్త్రీయ విధానాలను తిరస్కరించాలని,ఉచిత నిర్బంధ విద్య బోధనను 18 ఏళ్ల వరకు పెంచాలనే సిఫార్సులు వీటిలో అత్యంత అవసరమైనవి.కానీ,ఎఈపికి అనుగుణంగానే కాంగ్రెస్ సర్కార్ నడుస్తున్నది. రాష్ట్రంలో నేడు అమలవుతున్న విద్యావిధానం విషయంలో కఠోర వాస్తవాలను ఈ నివేదిక అందజేసింది.బడి బయట ఉన్న పిల్లల నుండి అసలు బడి అంటే ఏంటో తెలియని వారి సంఖ్యను కూడా వాస్తవాల రూపంలో వెలుగులో తెచ్చింది.ఈ వాస్తవాలే ఇప్పటి ప్రభుత్వానికి కంటగింపుగా మారాయి.వంద మంది విద్యార్థులలో 26 మంది మాత్రమే ప్రభుత్వ బడులలో చేరుతున్నారని సగానికి ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని,ప్రభుత్వ రంగంలో 36 శాతం ఏకోపాధ్యాయ బడులు కాగా,86శాతం బడులలో అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి విద్యా బోధన చేస్తున్నారని పేర్కొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని,కనీస సౌకర్యాలు లేవని కూడా తేల్చింది.నాణ్యమైన విద్యాబోధనలో మన స్థానం 26 అని,మూడవ తరగతి విద్యార్థులకు వారి కింది తరగతి పుస్తకం కూడా చదవలేని వెనుకబాటు తనం ఉందని,ఇంకా ఉన్నత విద్యా సంస్థలకు 77 శాతం కళాశాలకు న్యాక్ గుర్తింపు లేకపోవడం,యూనివర్సిటీల్లో 80 శాతం ఖాళీలతో భ్రష్టు పట్టించిన విషయాన్ని కుండ బద్దలు కొట్టి తెలియజెప్పింది.ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యమైన విద్య కోసం సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందించాలన్న తెలంగాణ విద్యా కమిషన్ లక్ష్యం విస్తృత ఆశయాన్ని ప్రతిబింబించింది. దీనితో కొత్త ఆశలు రెక్కలు తొడిగాయి,విద్యా కమిషన్ చాలా శ్రమకోర్చి పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ప్లస్ టు స్థాయి వరకు శ్రేష్ఠమైన విద్యకోసం తీసుకురావాల్సిన మార్పులను సూచించింది.ఫీజుల నియంత్రణ,ఐదేండ్ల ప్రణాళికను కచ్చితమైన బడ్జెట్ అంచనాలతో నివేదికను రూపొందించింది. కానీ ప్రభుత్వం ఆ నివేదికతో సంబంధం లేకుండానే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించింది.విద్యా కమిషన్ ఇంకా ఉన్నత విద్య, ఒకేషనల్,టెక్నికల్ విద్యకు సంబందించిన అంశాలపై చర్చలు,నివేదికలు పూర్తి చేయలేదు.అన్ని విషయాలతో సమగ్ర నివేదిక కూడా తయారు కాలేదు.ఈ లోపే ప్రభుత్వం గత నెలలో తెలంగాణ విద్యా విధానం(టిఈపి) రూపొందించడానికి ప్రాజెక్ట్ మేనెజ్‌మెంట్ యూనిట్‌ని రూపొందించింది. ఈ ప్రక్రియను అంతా పరిశీలిస్తే విద్యా కమిషన్‌లో నిర్మాణ సంబంధ లోపాలు,విద్యా విధాన రూపకల్పన ప్రక్రియకు సంబంధించిన లోపాలు స్పష్టం.దీంతో ఈ సంస్కరణల లక్ష్యం నెరవేరుతుందా? అనే అనుమానం కూడా కలుగుతుంది. నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదిక అమలుపై స్పష్టత ఇవ్వకపోగా కొత్తగా రిక్రూట్మెంట్ అయ్యే ఉపాధ్యాయుల వేతనాల విషయంలో మురళి కమిషన్ సిఫార్సులను పక్కనపెట్టి, ఉపాధ్యాయుల పదోన్నతుల అంశం ముందుకు తెచ్చి మెజార్టీ ప్రజలకు ఉపయోగకరమైన సిఫార్సులు అమలు చేయకుండా తొక్కి పెట్టిందనేది వాస్తవం. నిజానికి దేశంలోని అన్ని రంగాలలో ప్రయివేటీకరణ వేళ్లూనుకున్న నేపథ్యంలో విద్యా కమిషన్ తనకున్న పరిమితులతో ఆచరణలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి నివేదికను విడుదల చేసింది.అందుకే ప్రయివేటు విద్యా వ్యవస్థను ఒకేసారి రద్దు చేయాలనే డిమాండ్ నుంచి పక్కకు జరిగి ప్రభుత్వరంగ విద్యలో నాణ్యత పెంచి బాగు చేయడమే లక్ష్యంగా తన నివేదికను ఇచ్చింది. ఇకపోతే తెలంగాణలో పాఠశాల విద్య అంటే ప్రయివేటు విద్య మాత్రమే అనే భావన నెలకొని ఉంది.అందులోనూ ముఖ్యంగా తల్లిదండ్రులకు ఠక్కున గుర్తొచ్చేది నర్సరీ,ఎల్.కె.జి,యుకెజి బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన చేసే ప్రయివేటు పాఠశాలలే. ఈ రకమైన ప్రైవేట్ బోధన మాత్రమే నిజమైన,నాణ్యమైన చదువుగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో మురళి కమిషన్ ప్రభుత్వ రంగంలో కూడా నర్సరీ,ఎల్.కె.జి,యుకెజి లను బోధించే పూర్వ ప్రాథమిక విద్యను తీసుకు రావాల నడం,నర్సరీ నుండి పి.జి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్య బోధన జరపాలనడం మంచి అంశాలు. అలాగే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు,సౌకర్యాలు కలిగినట్టి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తరించి ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచాలి అని చెప్పడం,ప్రతి తరగతికి ఒక గది నిర్మాణం చేయాలనడం ఇందులో ముఖ్యమైనవి.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన,నిత్యం మానిటరింగ్ కోసం జిల్లా స్థాయి పర్యవేక్షణ బోర్డు ఏర్పాటు చేయాలనడం పేద,మధ్యతరగతి విద్యార్థులకు చాలా ఉపయోగకరమైనవి. పాఠశాల విద్యలో మరో సిఫార్సు ఆయా సొసైటీలుగా కొనసాగుతున్న గురుకుల విద్య సంస్థలను ఒకటిగా కలపడం.కుల వ్యవస్థను సుస్థిరం చేస్తున్న ఆయా కులాల గురుకులాలను కలిపి ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పౌరసమాజం నుంచి వచ్చినదే.ఇక ఇంటర్ విద్యలో చేసిన సిఫార్సులను పరిశీలిస్తే మెజారిటీ సిఫార్సులు ప్రయివేటు కళాశాలల,కోచింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టడానికి వచ్చినవే. కానీ,ఫీజుల నియంత్రణ చట్టం రూపొందించాలనే కమిషన్ సిఫార్సులు ఈ విద్యా సంవత్సరం అమలు చేస్తామని నేటికీ చట్టం రూపొందించకుండా మళ్లీ ఈ అంశంపై మరో మంత్రుల కమిటీ వేసింది సర్కార్.ఇది ప్రయివేటు విద్యా దోపిడీని కొనసాగించడమే అవుతుంది. ఇక ఉన్నత విద్యలో లోపభూయిష్టమైన విధానాలను,పాలకుల నిర్లక్ష్యాన్ని కండ్లకు కట్టినట్టు చూపుతున్న ఈ నివేదిక విద్యార్థులకు భారంగా మారిన సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు రద్దు చేసి,విద్యార్థి సంఘాలు ఎన్నికలు జరిపి,ప్రొఫెసర్ల నియామకాలు జరపాలి అని చెప్పడం,ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వ కళాశాలలుగా మార్చడం, ఐటిఐలను అఫ్ గ్రేడ్ చేయడం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అనుబంధంగా హాస్టళ్ల ఏర్పాటు చేయాలని చెప్పడం వంటి సిఫార్సులు విద్యార్థులకు ఉపయోగకరమైనవే. ఈ నివేదిక అమలైతే గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం నివేదికను ప్రజల మధ్య చర్చకు ఉంచి ఉపయోగకరమైన సిఫార్సులు అమలు చేయాలని అడగడంతో పాటు సమాన శాస్త్రీయ విద్య సాధన దీర్ఘకాలికంగా ప్రజలు,విద్యార్థులు ఉద్యమించాలి.అందులో భాగంగా తక్షణమే మురళి కమిషన్ చెప్పినట్లు విద్యారంగానికి 18శాతం నిధులను మంజూరు చేయాలి.ఈ నిధులు ప్రతీ ఏడాది పెంచుతూ వార్షిక బడ్జెట్‌లో 30శాతానికి పెంచాలి.పాఠశాలలను మూసివేయడం సమస్యకు ముగింపు కాదు.వాటికి పూర్వ వైభవం తీసుకురావడమే ఈ సమస్యకు పరిష్కారం. నాదెండ్ల శ్రీనివాస్, 96764071400

నిజం దృష్టి తెలుగు న్యూస్

బుధవారం 08-07-2026

## ఆ వందే భారత్‌లో కీలక మార్పులు ఇప్పుడు 8 కోచ్‌లకు బదులుగా 20 కోచ్‌లు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విషయంలో రైల్వే కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అదనపు కోచ్‌లను జోడిస్తోంది. ఇక్కడ రైల్వే మార్గంలో 8 కోచ్‌లు మాత్రమే ఉన్న వందే భారత్‌కు ఏకంగా 20 కోచ్‌ల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పుడు..పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా, ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అధిక సామర్థ్యం గల రైలుగా ఉన్నతీకరిస్తున్నారు. ఈ కొత్త ఏర్పాటులో భాగంగా రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్లు, 16 ఏసీ చైర్ కార్లు, రెండు డ్రైవర్ నడిపే కార్లతో సహా మొత్తం 20 ఆధునిక కోచ్‌లు ఉంటాయి. ఈ అదనపు కోచ్‌లు ప్రయాణీకులకు మరిన్ని సీట్లను, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. రాజస్థాన్ నుండి ఢిల్లీకి ప్రయాణించే ప్రయాణీకులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తూ, ఈ సూపర్‌ఫాస్ట్ రైలును మరింత ఆధునికంగా, సౌకర్యవంతంగా మార్చాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కూర్పు రైలు సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, సీట్ల లభ్యతను బాగా మెరుగుపరుస్తుంది.

**మే 24వ తేదీ నుంచి సాధారణ సర్వీసు ప్రారంభం:**

ప్రారంభ ప్రత్యేక రైలు తర్వాత ఈ రైలు కొత్త కోచ్‌ల కూర్పుతో సాధారణ సేవలను ప్రారంభిస్తుంది. మే 24, 2026 నుండి సాధారణ రైలు నంబర్ 26481/26482, జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్-జోధ్‌పూర్ వందే భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూర్తి 20 కోచ్‌లతో తన కొత్త రూపంలో పట్టాలపై నడుస్తుంది. రైల్వే తీసుకున్న ఈ చర్యతో జోధ్‌పూర్ నుండి జైపూర్ మీదుగా ఢిల్లీకి ప్రయాణించే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పర్యాటకులు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు కన్ఫర్మ్ సీటును పొందడంలో గొప్ప ఉపశమనం పొందుతారు.


## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని పరామర్శించిన

-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 7:** వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళుతున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని శంభీపూర్ లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి... ఈ సందర్భంగా వారి యొక్క యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

## "స్వప్రయోజనం ముగిసిన చోటే నాయకత్వం ప్రారంభమవుతుంది,ప్రజాసేవ ప్రారంభమైన చోటే నిజమైన నాయకత్వం వెలుగుతుంది."




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 7:** శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా,అలాగే టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు సేవ చేయడం నా బాధ్యత మాత్రమే కాదు,గొప్ప అదృష్టంగా కూడా భావిస్తున్నాను.ప్రజల పౌర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం,వారి గొంతుకను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం నా ప్రజా సేవలో అత్యంత ముఖ్యమైన బాధ్యతగా భావిస్తాను. కాలక్రమేణా ప్రజలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తూ,వారు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ వస్తున్నాను. పారిశుద్ధ్యం,డ్రైనేజీ,తాగునీటి సరఫరా,వీధి దీపాలు,రోడ్ల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రతి సమస్యను ప్రజల కోణంలో అర్థం చేసుకుని,వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాను.

## గచ్చిబౌలి నల్లగండ్ల గుల్మోహర్ కాలనీలో గంగమ్మ టీ స్టాల్ ప్రారంభించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేరి రామచందర్ యాదవ్

యువత స్వయం ఉపాధిగా ఎదగాలి.. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేరి రామచందర్ యాదవ్ పిలుపు



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 7:** గచ్చిబౌలి నల్లగండ్ల గుల్మోర్ కాలనీలో గంగమ్మ టీ స్టాల్ ప్రారంభించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేరి రామచందర్ యాదవ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ఎదగాలని అన్నారు. సమాజంలో యువతకు ఆదర్శంగా బతకాలని అన్నారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మన ఉన్న టాలెంట్ తో వ్యాపారంగంలో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు. యువత మత్తుకు చెడు వచనాలకు బానిస కాకూడదని స్వయం శక్తితో ఎదిగి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, గంగమ్మ టీ స్టాల్ ప్రొప్రైటర్ కొత్తూరు మనోజ్ ముదిరాజ్, నేతాజీ నగర్ యూత్ నాయకుడు భరత్ మరియు కాలనీవాసులు పాల్గొని గంగమ్మ టీ స్టాల్ ప్రారంభించారు దినదినం మంచి అభివృద్ధి చెందాలని మనోజ్ ముదిరాజ్ కి శుభాకాంక్షలు తెలిపినారు.

# బంగారం అద్భుతం చేసింది..

## కేవలం లక్ష రూపాయలు రూ.15 లక్షలుగా మార్చేసింది..!



ఫండ్స్ఇండియా ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక గత 20 నుండి 35 సంవత్సరాల డేటాను విశ్లేషించింది. ఈ నివేదికలోని ఆశ్చర్యకరమైన విషయాలు, పెట్టుబడిదారులు ఏకాగ్రతతో ఉండటం ద్వారా ఎలా కోటీశ్వరులు కాగలరో వెల్లడిస్తున్నాయి. గత 20 సంవత్సరాలుగా బంగారం పెట్టుబడిదారులను..గత 20 ఏళ్లుగా బంగారం అనూహ్యమైన పెరుగుదల పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. కేవలం రూ.1 లక్షను రూ.15 లక్షల భారీ ఫండ్‌గా మార్చింది. అయితే లాభాల పోటీలో రాబడుల విషయంలో బంగారాన్ని అధిగమించి, 17 రెట్లు రాబడులను అందించిన ఒక "సూపర్‌హిట్" ఆస్తి ఉంది. సాధారణంగా ప్రజలు ప్రమాదకరమని భావించి దూరంగా ఉండే ఈ ఆస్తి, నిశ్శబ్దంగా సంపద సృష్టిలో ఒక కొత్త చరిత్రను సృష్టించింది. బంగారం కాంతిని కూడా మించిపోయిన ఈ పెట్టుబడి సాధనం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఫండ్స్ఇండియా ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక గత 20 నుండి 35 సంవత్సరాల డేటాను విశ్లేషించింది. ఈ నివేదికలోని ఆశ్చర్యకరమైన విషయాలు, పెట్టుబడిదారులు ఏకాగ్రతతో ఉండటం ద్వారా ఎలా కోటీశ్వరులు కాగలరో వెల్లడిస్తున్నాయి. గత 20 సంవత్సరాలుగా బంగారం పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. నివేదికల ప్రకారం, బంగారం 14.6% ఆకట్టుకునే వార్షిక రాబడిని అందించింది. అంటే, 20 సంవత్సరాల క్రితం ఎవరైనా బంగారంలో రూ.100,000 పెట్టుబడి పెట్టి ఉంటే, ఈ రోజు దాని విలువ లక్షలాది రూపాయలు ఉండేది.

**20 నిమిషాల్లో ఛార్జ్.. 683 కి.మీ రేంజ్.. రూ.2 లక్షల డిస్కౌంట్..!**

అమెరికా స్టాక్ మార్కెట్ 20 ఏళ్లలో 17 రెట్లు లాభాన్ని చూసింది. అయితే బంగారం ధరలలో ఈ అనూహ్యమైన పెరుగుదల కూడా అమెరికా స్టాక్ మార్కెట్‌ను అధిగమించలేకపోయింది. అమెరికా మార్కెట్లు 20 ఏళ్లలో 15.2% వార్షిక రాబడిని అందించాయి. దీనితో రూ.1 లక్ష విలువ 17 రెట్లు పెరిగింది.

**భారత స్టాక్ మార్కెట్‌లో 35 ఏళ్లలో 86 రెట్ల లాభం:**

భారత స్టాక్ మార్కెట్ గురించి .. ఎన్నో ఒడిదుడుకులు, మాంద్యం ఎదురైనప్పటికీ, నిఫ్టీ 50 జూలై 1990 నుండి (దాదాపు 35 ఏళ్లుగా) ప్రతి సంవత్సరం సగటున 13.2% రాబడినిఇచ్చింది. ఈ వేగంతో 35 ఏళ్ల క్రితం పెట్టుబడి పెట్టిన రూ. 1 లక్ష ఈ రోజు రూ. 85 లక్షలు అయ్యింది. అంటే పెట్టుబడిదారుల డబ్బు దాదాపు 86 రెట్లు పెరిగింది. గత 20 ఏళ్లలో భారత స్టాక్ మార్కెట్ దాదాపు 11.4% వార్షిక రాబడిని ఇచ్చింది. దీని కారణంగా పెట్టుబడి 8.7 రెట్లు పెరిగింది. మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ కంపెనీలు అత్యధిక రాబడులను అందిస్తాయి. స్టాక్ మార్కెట్‌లో కూడా మిడ్-క్యాప్ కంపెనీలే ఆధిపత్యం చెలాయించాయి. మిడ్-క్యాప్ కంపెనీలు 20 ఏళ్లలో 14.6% వార్షిక రాబడులను అందించి, తమ సంపదను 15 రెట్లకు పైగా పెంచుకున్నాయి. స్మాల్-క్యాప్ కంపెనీలు 12.7% రాబడులను అందించి తమ సంపదను దాదాపు 11 రెట్లు పెంచుకున్నాయి. లార్జ్-క్యాప్ కంపెనీలు 11.8% రాబడులను అందించి, తమ సంపదను తొమ్మిది రెట్లు పెంచుకున్నాయి.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్ చాలా వెనుకబడి ఉన్నాయి:**

సురక్షితమైనవిగా భావించే సాంప్రదాయ పెట్టుబడులు ఈ పోటీలో చాలా వెనుకబడిపోయాయి. గత 20 ఏళ్లలో రియల్ ఎస్టేట్ కేవలం 7.9% వార్షిక రాబడిని మాత్రమే అందించింది. రుణ సాధనాల నుండి వచ్చే రాబడి కేవలం 7.5% నుండి 7.6%కి పరిమితమైంది.

**సహనమే కీలకం..**

స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలం (6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు) పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని, నష్టాలకు కూడా దారితీయవచ్చని నివేదిక స్పష్టంగా పేర్కొంది. అయితే 7 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం భారత మార్కెట్‌లో ఉన్న పెట్టుబడిదారులు నష్టాల ప్రమాదాన్ని చాలా తక్కువగా ఎదుర్కొని, గణనీయమైన లాభాలను ఆర్జించారని చరిత్ర చూపిస్తోంది.

# పిల్లలకు నేర్పుదాం ఆర్థిక పాఠాలు..!

## ఈ స్మార్ట్ టిప్స్ మస్ట్‌గా చెప్పాలి..




పిల్లలకు చిన్నప్పుడే డబ్బు విలువ, పొదుపు, బాధ్యతాయుతగా ఖర్చు వంటి ఆర్థిక పాఠాలు నేర్పించడం ఎంతో అవసరం. తల్లిదండ్రుల ప్రవర్తన, ఇంట్లో జరిగే ఆర్థిక చర్చలు పిల్లల భవిష్యత్తు డబ్బు అలవాట్లపై కీలక ప్రభావం చూపుతాయి. చిన్న చిన్న ఆచరణాత్మక పాఠాల ద్వారా పిల్లలను ఆర్థికంగా స్వతంత్రులుగా తీర్చిదిద్దవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి పిల్లలకు వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఈరోజుల్లో పిల్లలకు చదువుతో పాటు ఆర్థిక అంశాల మీద అవగాహన కూడా ఎంతో అవసరం. డబ్బు ఎలా సంపాదించాలి? ఎలా ఖర్చు పెట్టాలి? ఎలా పొదుపు చేయాలి? వంటి విషయాలను చిన్నప్పటి నుంచే నేర్పించాలి. అప్పుడే వారు భవిష్యత్తులో ఆర్థిక విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారు. ముఖ్యంగా ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లలకు మొదటి పాఠ్యపుస్తకం అవుతుంది. అందుకే ప్రతి ఇంట్లో చిన్న చిన్న ఆర్థిక పాఠాలు పిల్లలకు అలవాటు చేయడం చాలా ముఖ్యం.

1. ఆర్థిక పాఠాలు..త్వరగా ప్రారంభించండి

పిల్లలు చిన్న వయస్సులోనే డబ్బు విలువ అర్థమయ్యేలా చెప్పాలి. ఖర్చు, పొదుపు, అవసరం-ఆడంబరం మధ్య తేడా వంటి విషయాలను తల్లిదండ్రులు సాధారణ ఉదాహరణలతో చెప్పాలి. చిన్నప్పటి నుంచే డబ్బు పొదుపు చేయడం అలవాటు చేయాలి. అప్పుడే వారు డబ్బును జాగ్రత్తగా వినియోగించడం నేర్చుకుంటారు.

2. మాటల్లో కాదు చేతల్లో చూపండి..

మనం చెప్పే మాటల కంటే మనం చేసే పనులను పిల్లలు ఎక్కువగా గమనిస్తారు. తల్లిదండ్రులు మంచినీళ్ల ప్రాయంగా అవసరంలేని ఖర్చులు చేస్తే లేదా అప్పుల మీద జీవిస్తే పిల్లలు కూడా అదే అలవాట్లను అలవరుచుకునే అవకాశం ఉంటుంది. అలాగే దుబారా ఖర్చులకు దూరంగా ఉండటం, ముందుగా ప్లాన్ చేసుకోవడం, పొదుపు చేయడం వంటి మంచి అలవాట్లు పిల్లలపై సానుకూల ప్రభావం చూపుతాయి. ఆర్థిక క్రమశిక్షణకున్న పవర్ ఏంటో వారికి అర్థమయ్యేలా చేతల్లో చూపించాలి.

3. ఆర్థిక నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయండి

కుటుంబ ఖర్చులతో పాటు ఇంట్లో నిర్వహించే చిన్న చిన్న ఈవెంట్ల బడ్జెట్ ప్లానింగ్ వంటి విషయాల్లో పిల్లలను కూడా చేర్చడం మంచిది. ఉదాహరణకు పుట్టినరోజు వేడుకకు ఎంత ఖర్చు చేయాలి? ఏవి అవసరం? ఏవి తగ్గించవచ్చు? వంటి విషయాలను వారితో చర్చించండి. ఇలా చేయడం వల్ల డబ్బును వృధా చేయకూడదని.. దాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలనే అవగాహన వారికి వస్తుంది.

4. మీ ఇల్లే మొదటి ఆర్థిక పాఠశాల..

ఆర్థిక విషయ పరిజ్ఞానం పాఠశాల పుస్తకాలతో మాత్రమే రాదు. ఇంట్లోనే పిల్లలు నేర్చుకుంటారు. ఖర్చుల వివరాలను రాసిపెట్టుకోవడం.. సరైన నెలవారీ బడ్జెట్ అంశాల గురించి పిల్లలతో తప్పనిసరిగా చర్చించాలి. పొదుపు ఎందుకు చేయాలి? పొదుపు చేయకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక కష్టాలు? ఒక అవసరం కోసం మరొక కోరికను ఎలా వదులుకోవాలి? వంటి విషయాలను కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడుకుంటే పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. ఆర్థిక విషయాల్లో పిల్లల అభిప్రాయాలను కూడా తీసుకుంటే.. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

5. చివరి లక్ష్యం ఆర్థిక స్వాతంత్ర్యం

చిన్నప్పటి నుంచే సరైన ఆర్థిక అలవాట్లు నేర్చుకున్న పిల్లలు.. పెద్దయ్యాక మనీ విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. వారు అప్పుల బారిన పడకుండా, స్పష్టమైన లక్ష్యాలతో జీవించగలుగుతారు. దుబారా ఖర్చులకు దూరంగా పొదుపుపై దృష్టి పెట్టగలరు. ఆర్థిక స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాదు. అది చిన్న చిన్న అలవాట్లతో ప్రారంభమవుతుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు డబ్బు గురించి నిజాయితీగా, ఆచరణాత్మకంగా చెప్పడం చాలా అవసరం.పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పడం అనేది కేవలం డబ్బు గురించి చెప్పడం మాత్రమే కాదు.. బాధ్యత, ఆర్థిక ప్రణాళిక, స్వీయ నియంత్రణ వంటి విలువలను కూడా నేర్పించడం. చిన్న వయస్సులోనే సరైన ఆర్థిక అవగాహన కలిగిస్తే, వారు భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరమైన, ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా ఎదుగుతారు..

# ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లు ఉన్నాయా..?

## ఈ ఒక్క పని చేయకపోతే ఇబ్బందులే..



కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతూ ఉంటారు. ఇలాంటి సమయంలో పీఎఫ్ అకౌంట్లను బదిలీ చేయడం మర్చిపోతుంటారు. ఇలా చేస్తే మీరు ఇబ్బందుల్లో పడే అవకాశముంటుంది. కొత్త కంపెనీలో చేరినప్పుడు పాత అకౌంట్‌ను తప్పనిసరిగా విలీనం చేసుకోవాలని ఈపీఎఫ్‌వో చెబుతంది. అదెలా చేయాలి అనేది చూద్దాం. కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతుంటారు. ఇలాంటి సమయంలో ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లను కలిగి ఉంటారు. కంపెనీ మారినప్పుడు పాత అకౌంట్‌ను కొత్త కంపెనీ అకౌంట్లోకి మార్చుకోరు. కొత్త కంపెనీలో చేరిప్పుడు పాత పీఎప్ అకౌంట్‌ను కొత్త అకౌంట్లో విలీనం చేయడం అనేది అత్యవసరం. లేకపోతే మీరు చాలా నష్టపోవాల్సి ఉంటుంది. అలా చేసుకోకపోతే క్లెయిమ్, విత్ డ్రా సమయంలో ఇబ్బందులు పడే అవకాశముంటుంది. అసలు ఎలా పీఎఫ్ అకౌంట్లను విలీనం చేయాలి? స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇప్పుడు చూద్దాం.

కొత్త కంపెనీలో చేరారా..?

మీరు కంపెనీలు మారినప్పుడు మీ యూఏఎన్ నెంబర్‌తో మల్టీపుల్ మీ పీఎఫ్ అకౌంట్లు లింక్ చేసి ఉంటాయి. కొత్త కంపెనీలో చేరినప్పుడు ప్రత్యేక కొత్త మెంబర్ ఐడీ క్రియేట్ అవుతుంది. వీటిని మీరు విలీనం చేసుకోవాలి. పాత అకౌంట్లను కొత్త ఐడీలో విలీనం చేయాలి. దీని వల్ల పీఎఫ్ క్లెయిమ్, విత్ డ్రాలు వేగవంతంగా జరుగుతాయి. అంతేకాకుండా పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ కూడా స్థిరంగా జమ అవుతూ ఉంటుంది. ఇంతేకాకుండా పెన్షన్ పొందేందుకు సర్వీస్ హిస్టరీ కూడా ఖచ్చితంగా ఉంటుంది.

ఎలా విలీనం చేయాలంటే..?

యూఏఎన్ పోర్టల్‌లోకి వెళ్లి యూఏఎన్ నెంబర్, పాస్ వర్డ్‌తో లాగిన్ అవ్వండి

ఆన్ లైన్ సర్వీసెస్ ట్యాబ్‌పై క్లిక్ చేయండి

ఒక సభ్యుడు-ఒకే పీఎఫ్ ఖాతా అనే ఆప్షన్ ఎంచుకోండి

మీ వ్యక్తిగత వివరాలు, పీఎఫ్ ఖాతాలను ధృవీకరించండి

మీ పాత పీఎఫ్ యజమాని వివరాలు చూడటానికి గెట్ డీటైల్స్‌పై క్లిక్ చేయండి

ధృవీకరణ కోసం ప్రస్తుత లేదా పాత యాజమానిని ఎంచుకోండి

సభ్యుని ఐడీ లేదా యూఏఎన్ నెంబర్ ఎంటర్ చేయండి

గెట్ ఓటీపీపై క్లిక్ చేయండి

మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీని క్లిక్ చేస్తే సరిపోతుంది

ఈమెయిల్ ద్వారా చేయడం ఎలా..?

ఋఅవజూటఏవజూటఊఅఎఋ.స్త్రశీజ.ఊఅకు వివరాలు మెయిల్ చేయడం ద్వారా కూడా విలీనం చేసుకోవచ్చు. పాత యూఏఎన్ నెంబర్‌ను మూసివేయమని చెప్పండి. అనంతరం పీఎఫ్ సంస్థ మీ పాత అకౌంట్‌ను ఇనాక్టివ్ చేసి ఎస్ఎంఎస్ పంపుతుంది. ఇక మీరు పీఎఫ్ విలీనానికి సంబంధించి రిక్వెస్ట్ పెట్టుకున్నా స్టేటస్ చెక్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో పోర్టల్‌ను సందర్శించి ట్రాక్ క్లెయిమ్ స్టేటస్‌పై క్లిక్ చేయండి. ఇక్కడ పెండింగ్‌లో ఉన్న, ఆమోదించిన రిక్వెస్ట్ వివరాలు కనిపిస్తాయి. అయితే భవిష్యత్తులో ఆటోమేటిక్‌గా పీఎఫ్ అకౌంట్లు బదిలీ జరిగేలా కొత్త వ్యవస్థను ఈపీఎఫ్‌వో రూపొందిస్తోంది. త్వరలో కొత్త విధానం అమల్లోకి రానుంది.